

మోమిన్‌పేటలో ఓట్ల వేట

మోమిన్‌పేట మండల పరిధిలోని ఓటర్లు తీర్పు మార్చడం లేదు. ఏళ్ల నుంచి ఇదే ఒరవడి సాగిస్తున్నారు. 10లో ▸



ప్రతి హామీ అమలు చేస్తాం

కేసీఆర్ పాలనలో ఎవరు అభివృద్ధి చెందారో ప్రజలే గమనించాలని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ విమర్శించారు. 10లో ▸



హరితహననం..

హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. 11లో ▸

అంతా పాతకాపులే..

బీఆర్‌ఎస్ తరఫున అందరూ రెండోసారి బరిలో దిగుతున్నవారే

- కాంగ్రెస్‌లో ఒక్కరు మినహా ముగ్గురూ పాతవారే
- మనోహర్‌రెడ్డి మొదటిసారిగా అసెంబ్లీ బరిలో..
- బీజేపీ తరఫున అన్నీ కొత్త ముఖాలే



వికారాబాద్: ప్రస్తుత ఎన్నికల్లో అంతా పాతకాపులే పోటీ పడుతున్నారు. ఒక్క తాండూరు మినహా మిగతా మూడు నియోజకవర్గాల్లో ఈ సారి కూడా పాత వారే పోటీలో ఉన్నారు. రెండు ప్రధాన పార్టీల్లో ఒక్క మనోహర్‌రెడ్డి మినహా ప్రస్తుతం పోటీలో ఉన్నవారందరూ 2018 అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన వారే కావడం గమనార్హం. గత ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కొత్త, పాతల మధ్య పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో అందుకు భిన్నంగా సమరం కనిపిస్తోంది. బీజేపీలో అన్నీ కొత్త ముఖాలే కనిపిస్తుండగా, అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లో ఎనిమిది మంది అభ్యర్థుల్లో తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మాత్రమే ఎమ్మెల్యేగా మొదటి సారి బరిలో నిలిచారు. అధికార పార్టీ ఈ సారి కొత్త వ్యక్తులెవరికీ అవకాశం ఇవ్వక పోవడంతో నలుగురు అభ్యర్థులు కూడా ఎమ్మెల్యేగా రెండో సారి బరిలోకి దిగుతున్నారు. ఇక మంత్రి మహేందర్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటూ వచ్చినా మొదటి సారి ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. అధికార బీఆర్‌ఎస్ 2018 ఎన్నికల్లో ముగ్గురు కొత్త వ్యక్తులకు టికెట్లు కేటాయించటంతో పాటు ఆ మూడు చోట్ల విజయం సాధించింది. అయితే ఈ సారి కూడా ఆ ముగ్గురికి టికెట్లు కేటాయించగా తాండూరు స్థానంలో మహేందర్‌రెడ్డికి బదులుగా కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన పైలెట్ రోహిత్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. అయితే ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తున్న నలుగురు అభ్యర్థులకు ఓ సారుప్యత ఉంది. వీరందరూ 2018లో మొదటి సారి అసెంబ్లీ బరిలో దిగటంతో పాటు తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలిచి సక్సెస్ అయ్యారు. మరోసారి బరిలో నిలిచారు. వీరి మధ్య మరో పోలిక కూడా ఉంది. తాండూరు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాత్రమే ఎంపీపీగా, ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించాక కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఇక మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి ముగ్గురు కూడా గతంలో ఏ ఎన్నికల్లో కూడా పోటీ చేయకుండానే నేరుగా ఎమ్మెల్యే టికెట్ సాధించి గెలుపొందారు.

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా భీం భరత్ పోటీ చేస్తుండగా, బీజేపీ నుంచి కేఎస్ రత్నం నాలుగో సారి ఎమ్మెల్యేగా బరిలో దిగారు. గతంలో రత్నం మూడు పర్యాయాలు పోటీ చేసి ఒక్క సారి గెలుపొందారు. అతనికి జెడ్పీ చైర్మన్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉంది. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య అసెంబ్లీ బరిలో ఉన్నారు. ఇతను మూడో సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తుండగా గతంలో రెండు సార్లు చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు.

వికారాబాద్ నుంచి..

వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పోటీ పడుతున్నారు. ఇతను ఐదో సారి పోటీ చేస్తున్నారు. గతంలో రెండు సార్లు గెలవగా రెండు సార్లు ఓటమిపాలయ్యారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మెతుకు ఆనంద్ 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి రెండోసారి బరిలో ఉన్నారు. ఇక బీజేపీ తరఫున కొత్త వ్యక్తి పెద్దింటి నవీన్‌కుమార్‌గా ఎమ్మెల్యేగా బరిలోకి దిగారు.

పరిగి సమరం..

పరిగి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి నాలుగోసారి పోటీ చేస్తుండగా గతంలో రెండు సార్లు ఓడి ఓ సారి గెలుపొందారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రెండోసారి బరిలో నిలిచారు. ఇక బీజేపీ అభ్యర్థిగా కొత్త వ్యక్తి, స్థానికేతరుడు అయిన బూనేటి కిరణ్ ఎమ్మెల్యేగా బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.

కొడంగల్ పోరులో..

కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా నాలుగోసారి పోటీ చేస్తుండగా గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఓ సారి 2018లో అనూహ్య రీతిలో కొత్త వ్యక్తి నరేందర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం కొడంగల్ బరిలో ఉన్నారు. బీఆర్‌ఎస్ తరఫున గతంలో ఎమ్మెల్సీగా, ఓ సారి ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిల్‌రెడ్డి రెండో సారి పోటీ చేస్తున్నారు.

తాండూరు బరిలో..

సీఎం కేసీఆర్ సిట్టింగులకే సీట్లు కేటాయించడంతో తాండూరు అసెంబ్లీ సీటు రోహిత్‌రెడ్డికి దక్కింది. టికెట్‌పై ఆశలు పెట్టుకున్న పట్నం మహేందర్‌రెడ్డికి అధిష్టానం మంత్రి పదవి ఇచ్చి బుజ్జగించింది. దీంతో ఆయన ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. గతంలో పట్నం మహేందర్‌రెడ్డి ఆరు సార్లు పోటీ చేయగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు ఓటమిని చవి చూశారు. 2014 ఎన్నికల్లో మొదటిసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పైలెట్ ఓటమి పాలయ్యారు. అనంతరం 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. తదనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం అధికార పార్టీ అభ్యర్థిగా మూడో సారి బరిలో నిలిచారు. బీజేపీతో పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థి శంకర్‌గౌడ్ మొదటి సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.



సిద్దులూర్ ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తాం

- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం
- బీఆర్‌ఎస్ వికారాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆనంద్
- మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి

అనంతగిరి: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలను బీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్ చేస్తుందని ఆ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ మండలం సిద్దులూర్, మదన్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని, పార్టీ అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తారని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ కోసం ముందుండి పోరాటం చేసిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని పేర్కొన్నారు. నేడు రాష్ట్రం సంక్షేమానికి మారుపేరుగా మారిందన్నారు. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధికి దూరమైందని అన్నారు. వికారాబాద్ సమస్యలను పలు మార్లు అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించినట్లు తెలిపారు. మరోసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, సిద్దులూర్ ఎంపీటీసీ గౌసొద్దీన్, పార్టీ సీనియర్ నాయకులు రాఘువేందర్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, సంతోష్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది అవినీతి పాలన

- ప్రభుత్వంలో కీలక పదవులన్నీ ఆ కుటుంబానికే
- ఏఐసీసీ డెలిగేట్ షమా మహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న షమా మహ్మద్

తాండూరు: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతి పాలన కొనసాగుతోందని ఏఐసీసీ డెలిగేట్ షమా మహ్మద్ అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం అంతులేని అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వంలోని కీలక పదవులన్నీ ఆయన ఇంటి(కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు)కే పరిమితమయ్యాయని మండిపడ్డారు. దీంతో అడ్డు అదుపు లేకుండా అవినీతి చేశారన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు 15 కోట్లు ఆస్తి ఉండగా.. ప్రస్తుతం రూ.59కోట్లకు పెరిగిందన్నారు. మంత్రి కేటీఆర్‌కు గతంలో రూ.7 కోట్లు ఉంటే ప్రస్తుతం రూ.53 కోట్లకు, కేసీఆర్ కూతురు కవితకు రూ.6 కోట్లు ఉండగా తాజాగా 30 కోట్లకు చేరిందని వివరించారు. రూ.2 కోట్ల ఆస్తి ఉన్న హరీశ్‌రావు ప్రస్తుతం రూ.30 కోట్ల ఆస్తి అధికారికంగా చూపించారని తెలిపారు. రూ.4కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును రూ.105 కోట్లకు పెంచారని తెలిపారు. మేఘా నిర్మాణ సంస్థ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వాటాలు అందాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి రూ.352 కోట్లను ముట్టాయని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దశాబ్దాల క్రితమే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే ఇచ్చిన మాటపై నిలబడుతుందని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మిన కర్ణాటక ప్రజలు అధికారం ఇచ్చారని, తెలంగాణలో కూడా తమదే అధికారమని తెలిపారు. బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమయ్యారన్నారు. అధికారంలోకి రాగానే రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఓటర్లకు వసతులు కల్పించాలి

ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఆకాష్



ఎన్నికల ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న ఆకాష్ తదితరులు

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఆకాష్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి తాండూరులోని సాయిపూర్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి వివరించారు. దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, తాగునీరు, మూత్రశాలల వంటివి ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎన్నికల విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన నియోజకవర్గ సెక్టోరల్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు కోసం వసతులు కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు పోలింగ్ చిట్టీలను ప్రతి ఓటరుకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



కదుమూరు గ్రామ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అభివృద్ధిలో.. మనమే రోల్‌మోడల్

- పదేళ్లలో గ్రామాల రూపురేఖలు మారాయి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: అభివృద్ధిలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంగడిచిట్టంపల్లి, చన్గోముల్, కుత్బుల్లాపూర్, మిట్టకంకల్, కదుమూరు, మేడిపల్లికలాన్, మేడికొండ, కంకల్, పుడుగుర్తి, చింతలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. మరో సారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని అన్నారు. రాష్ట్రంలో 70లక్షల మంది అన్నదాతలకు రైతు బంధు ఇచ్చామని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. దశలవారీగా ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే 93లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, అజారుద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు అజిమొద్దీన్, నర్సింహారెడ్డి, రహీంఖాన్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఓటమి భయం

- అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు
- కాంగ్రెస్ పార్టీ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశా



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఓటమి భయంతోనే మంత్రి కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, పరిగి అసెంబ్లీ అభ్యర్థి టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కుల్కచర్ల రోడ్ షోలో మంత్రి కేటీఆర్ తన గురించి పరోక్షంగా ఆరోపణలు చేశారని అన్నారు. పరిగి అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను పదవిలో లేనని, అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వేల కోట్ల రూపాయలు తెచ్చి ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు పనులు ప్రారంభం కావడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఆ పనులను రద్దు చేసి కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మిస్తుండటం, ఆ డబ్బులను కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించడం నిజం కాదా అని ప్రశ్నించారు. చేవెళ్ల వరకు ఉన్న ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డితో మాట్లాడి పరిగి వరకు నీళ్లు తీసుకువచ్చానని గుర్తు చేశారు. పరిగికి నీళ్లు తెచ్చేందుకు తాను ఎన్నో పోరాటాలు చేశానని, ఆ క్రమంలో నాపై అక్రమ కేసులు పెట్టింది మీ ప్రభుత్వమేనని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఉద్యమాన్ని ఆపకుండా జిల్లా ప్రజల కోసం పని చేసినట్లు తెలిపారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ పరిగి నియోజకవర్గానికి నీళ్లు తెస్తామని అయ్యా, కొడుకులు హామీలు ఇస్తారే తప్ప.. మళ్లీ ఎన్నికలు వచ్చేంతవరకు ఇటు వైపు చూడరని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో తాను పరిగి నియోజకవర్గానికి తెచ్చిన నిధులను మంత్రి కేటీఆర్‌కు పంపుతానని, దమ్ముంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వివరాలు వెల్లడించాలని సవాల్ విసిరారు. తాను ఎలాంటి అక్రమాలు, భూ కబ్జాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులే అక్రమ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ తనకు ఫోన్ చేసి తన కళాశాలలో సీటు కావాలని అడిగిన విషయం గుర్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు రాఘువేందర్‌రెడ్డి, బంట్ల యాదయ్యగౌడ్, యాదయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేటీఆర్ రోడ్ షోను సక్సెస్ చేద్దాం

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మర్పల్లి: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 3గంటలకు జరిగే మంత్రి కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేద్దామని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, జెడ్పీటీసీ మధుకర్‌తో హెలిక్యాప్టర్ ల్యాండ్ చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణులతో మాట్లాడారు. ఏఏ గ్రామం నుంచి ఎంతమంది కార్యకర్తలు వస్తారు, ఎన్ని వాహనాలు అవసరం అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలం నుంచి 20 వేల మందికి తగ్గకుండా కార్యకర్తలు, ప్రజలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సోయేల్ షరీఫ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాచన్న, ఉపాధ్యక్షులు రమేష్ మిత్ర, అశోక్, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అఖిల్‌గౌడ్



కుల్కచర్ల: జాతీయ స్థాయి అండర్ –19 వాలీబాల్ పోటీలకు కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లికి చెందిన జంగం అఖిల్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ నెల 11, 12వ తేదీల్లో గుజరాత్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అఖిల్‌గౌడ్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి పోటీలకు ఎంపికయ్యారు.

ప్రతి నర్సరీలో 5వేల మొక్కలు పెంచాలి

డీఆర్‌డీఓ కృష్ణన్



ఎన్కేపల్లి నర్సరీలో మొక్కల పెంపకం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కృష్ణన్

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీల్లోని ప్రతి నర్సరీలో 5వేల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని వెల్‌చాల్, ఎన్కేపల్లి గ్రామాల నర్సరీలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నర్సరీలో అన్ని రకాల మొక్కలను పెంచాలన్నారు. విత్తు వేయడంలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొక్కల ఎదుగుదలకు ఎరువులు, క్రమం తప్పకుండ నీళ్లు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శంకర్, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతమ్మ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు హన్మంతు, అడివిరెడ్డి పాల్గొన్నారు.

పరిగి ఆస్పత్రిలో వైద్యుడి రాసలీలలు

వీడియో వైరల్ కావడంతో మెమో జారీ చేసిన డీసీహెచ్‌ఎస్

పరిగి: పరిగి ప్రభుత్వ ఆసుపత్రి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వీకెండ్ వచ్చిందంటే ఆస్పత్రి గదుల్లో అపరిచిత యువతులు తిష్ట వేస్తున్నారు. పట్టణ కేంద్రంలోని సర్కారు దవాఖానాలో డ్యూటీలో ఉన్న ఓ డాక్టర్ రాసలీలు సాగిస్తున్న ఓ వీడియో వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం డ్యూటీలో ఉన్న డాక్టర్ రాత్రంతా ఇద్దరు యువతులతో కలిసి ఉండటాన్ని సిబ్బంది గమనించారు. యువతులు ఎవరని ప్రశ్నించగా తన జూనియర్లని, ట్రైనింగ్ కోసం తీసుకువచ్చానని బుకాయించాడు. గతంలో కూడా అనేక సార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. సదరు వీడియో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో.. డీసీహెచ్‌ఎస్ (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) ప్రదీప్‌కుమార్ దృష్టికి వెళ్లింది. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం సంబంధిత వైద్యుడికి మెమో జారీ చేశారు. ఇదిలా ఉండగా.. తాను ఎలాంటి తప్పు చేయలేదంటూ సదరు డాక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవడం గమనార్హం.

క్లుప్తంగా

ఎన్నికల విధులు పక్కాగా నిర్వర్తించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి



మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి

ఇబ్రహీంపట్నం రూరల్: పరిపూర్ణమైన అవగాహనతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శేరిగూడ శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోళికేరి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, చిన్న తప్పిదానికి కూడా ఆస్కారం కల్పించకూడదని తెలిపారు. నిబంధనలు ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహించిన తరువాత తప్పనిసరి డేటా డిలీట్ చేయాలని, ఈవిషయాన్ని ప్రతి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన మీదట ఎన్ని ఓట్లు పోలయ్యాయి అనే వివరాలను జాగ్రత్తగా సరిపోల్చుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ఓటింగ్ యంత్రాల్లో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. మాక్ పోల్ సమయంలో సాంకేతిక సమస్య ఏర్పడినప్పుడు సంబంధిత యంత్రాన్ని మాత్రమే మార్చాలన్నారు. పోలింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్క దానిలో సమస్య తలెత్తినా సీయూ, బీయూలను మార్చాలన్నారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్‌గైడ్ బుక్ రిలీజ్

ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్‌తో కలిసి ఓటరుగైడ్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్.రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని సీతారాంపూర్, బోడంపహాడ్, అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న తుగ్లక్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. తెలంగాణకు ద్రోహం చేస్తున్న బీఆర్ఎస్ పాలనను అంత మొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు నారాయణ, శ్రీధర్‌రెడ్డి, రాము, మాణెయ్య, మహేశ్ తదితరులున్నారు.

ఆశీర్వదించండి అండగా ఉంటా



ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్ రెడ్డి

కొందుర్గు: ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటానని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లచ్చంపేట, తుమ్మలపల్లి, వనంపల్లి, తూంపల్లి, పద్మారం, ఎల్కగూడ, లక్ష్మీదేవిపల్లి, వీరన్నపేట, గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తను ఇప్పటికే పాలమూరు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని, తనను ఆదరించి సింహం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మోమిన్‌పేటలో ఓట్ల వేట

- పట్టు కోసం కారు, కాంగ్రెస్ నేతల యత్నం
- ఇక్కడ మెజార్టీ సాధించిన వారిదే ఎమ్మెల్యే సీటు
- నలభై ఏళ్లుగా కొనసాగుతున్న చరిత్ర



మోమిన్‌పేట: మండల పరిధిలోని ఓటర్లు తీర్పు మార్చడం లేదు. ఏళ్ల నుంచి ఇదే తంతు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను సాధించుకుని పాగా వేయాలని కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ వ్యతిరేకంగా వేసే ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకుని అధిక మెజార్టీ సాధించాలని బీఆర్ఎస్ నాయకులు ఓట్ల వేటలో మునిగిపోయారు. 1985 నుంచి 2008 ఉప ఎన్నిక వరకు టీడీపీకే మెజార్టీ ఇస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు 2008లో ఎ.చంద్రశేఖర్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. 2008 ఉప ఎన్నిక, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన 2014, 2018 ఎన్నికల్లో కారుకు మెజార్టీ కట్టబెట్టారు. ఇదే ఊపును కొనసాగించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతోపాటుగా యువతను ప్రసన్నం చేసుకుని మెజార్టీ సాధించి 2008, 2009 ఎన్నికల ఫలితాలు పునరావృతం చేసేందుకు కాంగ్రెస్ ఇంటింటికి తిరుగుతూ.. ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తున్నారు.

యువత తొలి ఓటు ఎటో..?

2018 సాధారణ ఎన్నికలలో 33,237ఓట్లు ఉండగా నేడు 37,707ఓట్లు నమోదయ్యాయి. సుమారుగా 4వేల ఓట్లు పెరిగాయి. నూతనంగా నమోదు చేసుకున్న ఓటరులు యువకులే కావడంతో అభ్యర్థి మెజార్టీ సాధించేందుకు వీరే కీలకం కానున్నారు. యువత ఏ పార్టీకి మొగ్గు చూపితే ఆ పార్టీ మెజార్టీ సాధించడం ఖాయం. నిరుద్యోగులకు బీఆర్ఎస్ ప్రభుత్వ మొండి వైఖరిని ఎండ కడుతూ కాంగ్రెస్ ఓట్లను సాధించేందుకు కృషి చేస్తోంది.

కండువాలు మార్చిన అనుచరులు

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్, టీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టరు మెతుకు అనంద్‌లు బరిలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చీమల్‌దరి సర్పంచ్ నర్సింహారెడ్డి, పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రస్తుత బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ ప్రచార బాధ్యత తీసుకున్నారు. టీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. ఎమ్మెల్యేగా గెలిచిన ఆనంద్‌తో పొసగక ఆయన పార్టీకి దూరంగా ఉన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ నుంచి చీమల్‌దరి సర్పంచ్ నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్ కారెక్కారు. బీఆర్ఎస్‌కు దూరంగా ఉన్న నరోత్తంరెడ్డి ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో వారు పార్టీల గెలుపు కోసం ఇరు వర్గాల నాయకులు ప్రచారంలో తలపడుతున్నారు. మండల ఓటరులు ఏ పార్టీకి మెజార్టీ ఇస్తారో వేచి చూడాల్సిందే.

బీఆర్ఎస్ నేతలకు ఓటమి భయం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోతున్నాడన్న అభద్రతా భావంతో ఐటీ మంత్రి కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు బొలుసాని భీంరెడ్డి ఆరోపించారు. సోమవారం కుల్కచర్లలో కేటీఆర్ రోడ్‌షోలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని విమర్శించడంపై మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు గ్రామీణ ప్రాంతంలో విద్యుత్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. మండలంలో కాంగ్రెస్ హయాంలో ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్‌లు తప్పిస్తే కొత్తగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. నాడు నిరుపేదలకు విద్య అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఎగ్జిబిషన్ సొసైటీని ఏర్పాటు చేసి కళాశాలలు రూపొందించామన్నారు. ప్రస్తుతం అవి నిర్వీర్యమవుతున్నాయన్నారు. గతంలో గిరిపుత్రులకు వసతిగృహాలు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కాంగ్రెస్‌లో ఏ నిర్ణయమైనా ఢిల్లీ నుంచి రావాలని అంటున్న కేటీఆర్ అక్కడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎందుకు ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. అవినీతి సొమ్ముతో ఎదిగిన బీఆర్ఎస్ నేతలు నిజాయతీ గల నాయకుడిని విమర్శించే అర్హత లేదన్నారు. నాడు ఇంజినీరింగ్ సీట్లకై రామ్మోహన్‌రెడ్డి ఆఫీసుల చుట్టూ తిరిగిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, గోపాల్ నాయక్, బాలముకుందం, ఆంజనేయులు, పెంటయ్య, కుమ్మరి స్వామి, రమేశ్, మొగులయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, కృష్ణయ్య, శివానంద్, నర్సింలు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ హామీ నేరవేరుస్తాం



ఎల్లకొండలో కాంగ్రెస్ నేతల ప్రచారం

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్

నవాబుపేట: కేసీఆర్ పాలనలో ఎవరు అభివృద్ధి చెందారో ప్రజలే గమనించాలని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ విమర్శించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గుబ్బడి పత్తేపూర్, ముబారక్పూర్, గంగ్యాడ, ఎల్లకొండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీం భరత్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం పూటకు ఒక పార్టీ మారే వ్యక్తి అన్నారు. ఆయన వల్ల చేవెళ్లకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యాదయ్య నియోజకవర్గానికి ఏమి చేశాడో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇస్తున్న ప్రతీ హామీ నెరవేరుతుందన్నారు. తనకు అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్‌లు రాములు, ప్రభాకర్ రెడ్డి, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కొండల్‌యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం



ప్రచారం రథంపై మాట్లాడుతున్న ఆచారి

తలకొండపల్లి: కల్వకుర్తిలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్, బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గాజుగ్లాసు'తోనే ఎన్నికల బరిలో..

- ఎనిమిది స్థానాల్లో గెలిచి తీరుతాం
- జనసేన తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్‌గౌడ్

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎలక్షన్‌లో గాజుగ్లాసు గుర్తుతోనే ఎన్నికల బరిలో దిగుతున్నట్లు తాండూరు జనసేన–బీజేపీ సంయుక్త అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఓటమి భయంతో ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొదన్నారు. ఇందుకు సంబంధించి ఎ–ఫాంను ఇప్పటికే రిటర్నింగ్ అధికారి సమర్పించామన్నారు. ఎన్నికల కమిషన్‌కు సైతం దరఖాస్తు చేశామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన–బీజేపీ సంయుక్తంగా పోటీ చేస్తున్న ఎనిమిది స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి రహిత రాజకీయాలే జనసేన లక్ష్యమన్నారు. తాండూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు అంగబలం, అర్థబలంతో ఓట్లు రాబట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రవి పటేల్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్ గౌడ్

సామాజిక మాధ్యమాల్లో పొలిటికల్ యుద్ధం

ఫోన్లు, ఇంటర్నెట్‌ల వాడకం పెరిగిన నేపథ్యంలో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ వేదికగా రాజకీయ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక సైన్యం సైతం పనిచేస్తోంది. అభ్యర్థులు, ప్రత్యర్థులు తమదైన శైలిలో దూసుకుపోతున్నారు.

- ప్రచారంలో దూసుకుపోతున్న రాజకీయ పార్టీలు
- అభ్యర్థుల తరఫున పనిచేస్తున్న ప్రత్యేక సైన్యం



మంచాల: ఒక్కప్పుడు యోగ క్షేమాలు తెలుసుకునేందుకు మొబైల్ ఫోన్ నేడు ప్రతీ పనికి ప్రధానాధారమైంది. ప్రస్తుతం చరవాణి లేకుంటే చేయి విరిగినంత పని అవుతోంది. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు సెల్ నిత్యకృత్యమైంది. పెరిగిన సాంకేతికతతో కూర్చున్న చోటు నుంచే ప్రపంచాన్ని చుట్టేయొచ్చు. ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్న మొబైల్ ఫోన్ అంతే స్థాయిలో వినాశనాలకు ఉపయోగిస్తున్నారు. సెల్ ఫోన్ ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగించే వారిపై సైబర్ నేరాల నివారణ చట్టాలను సైతం తీసుకువచ్చింది.

ప్రధాన ప్రచారాస్త్రంగా సెల్‌ఫోన్

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొబైల్ ఫోన్ ఓ ప్రధాన ప్రచార వేదికగా మారింది. ఎక్కడ ఏమి జరిగిన క్షణాల్లో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్తుంది. ప్రత్యర్థులు సైతం సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తమ ఎన్నికల ప్రచారాలతో పాటు ప్రత్యర్థులు మీద విమర్శలు గుప్పిస్తున్నారు. టీవీ చానళ్లు, దిన పత్రికలతో పాటు సోషల్ మీడియాకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

క్షణాల్లోనే వైరల్

రాజకీయ నాయకులు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఓ ఓటర్లను ఆకట్టునేందుకు ప్రజల్లో ఉంటూనే ప్రత్యర్థుల ఆటకట్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తాము చేసిన పనులు ప్రజల్లోకి తీసుకొని పోవడంతో పాటుగా తమను విమర్శించే వారికి ఇదే వేదికగా సమాధానం చెబుతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను నియమించుకుంటూ వార్‌కు సమాయత్తం చేస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో పాటు ప్రత్యర్థుల పరపతి తగ్గించే పనులకు శ్రీకారం చుట్టుతున్నారు. ఇలా.. సోషల్‌మీడియాలో ప్రత్యర్థుల ఎన్నికల వార్ జోరుగా సాగుతోంది. గతంలో సభలు, సమావేశాలకు పరిమితమైన ఆరోపణలు, విమర్శలు చేసేవారు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నా లైవ్ పెట్టి మరీ తిప్పికొడుతున్నారు. సభలు, సమావేశాల వీడియోలు, ఫొటోలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి.

వాస్తవమా..? అవాస్తవమా..?

ఫోన్ ఆన్ చేస్తే చాలు వందల కొద్దీ ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన ఫొటోలు, వార్తలు, ప్రత్యర్థి పార్టీలకు వ్యతిరేక వార్తలను సృష్టించి మరీ పెడుతున్నారు. ఏది వాస్తవం.. అవాస్తవం గుర్తించడం కష్టతరంగా మారింది. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వేదికగా కఠోర వాస్తవాలు వెలుగులోకి వచ్చినా.. మరికొన్ని సందర్భాల్లో అవాస్తవాలు సైతం చక్కర్లు కొడుతున్నాయి. ఏది ఏమైనా 'సోషల్ వార్' రాజకీయాలను వేడెక్కిస్తుంది.

భద్రత కల్పిస్తాం.. ఓటేయండి



కవాతులో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐలు రాములు, చంద్రశేఖర్

బొంరాస్‌పేట, దుద్యాలలో 'ఫ్లాగ్ మార్చ్'

బొంరాస్‌పేట: ఎన్నికల నిర్వహణలో మండల, గ్రామస్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాల్లో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహించారు. పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ రాములు, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీఏపీఎఫ్, టీఎస్ఎస్పీ ప్రత్యేక బలగాలు కవాతు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలన అంతం కావాలి

- ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణ
- ప్రత్యేక రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు
- షాద్‌నగర్ బీజేపీ విజయగర్జన సభలో ఈటల రాజేందర్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఈటల రాజేందర్, నేతలు

షాద్‌నగర్: రాష్ట్రంలో కొనసాగుతున్న దుర్మార్గపు పాలన అంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం షాద్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి అందె బాబయ్య ఆధ్వర్యంలో బీజేపీ విజయ గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఆత్మత్యాగాల ఫలితంగానే తెలంగాణ వచ్చిందన్నారు. ఉద్యమ సమయంలో తనపై కూడా కేసులు పెట్టడంతో మహబూబ్‌నగర్ జైల్లో ఉన్నానని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పేదల నుంచి బలవంతంగా భూములు లాక్కొని పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చారన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.4,250కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలను కలవడం లేదని, ప్రగతి భవన్, ఫాంహౌస్‌లకు మాత్రమే పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేందుకు డబ్బు సంచులతో కుట్ర చేస్తున్నా రని ఆరోపించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, అందెబాబయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కమలం.. కదనోత్సాహం

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప సభ నిర్వహించారు. పట్టణ శివారులోని బాలాజీ టౌన్‌షిప్ సమీపంలో నిర్వహించిన సభకు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరయ్యారు. జిల్లా నాయకులతో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సభకు జనం పెద్ద ఎత్తున తరలిరావడం.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఈటల మాటలతూటాలు పార్టీ శ్రేణుల్లోఉత్సాహం నింపాయి. మన తలరాత మారడానికి ఏకైక ఆయుధం ఓటు మాత్రమేనని, అలాంటి ఓటును అమ్ముకోవద్దని హితవుపలికారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమలం పువ్వుకు ఓటువేసి అందె బాబయ్యను గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌ను నమ్మొద్దు..

పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్‌ను నమ్మకుండా దేశాభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీజేపీకి పట్టం కట్టాలని పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ అబద్దాల పాలనలకు కాలం చెల్లిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయరాజు, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వెంకటేశ్ గౌడ్

అరగంటలో అటు.. ఇటు!

అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కండువాల మార్పులు ఊపందుకున్నాయి. పట్టణానికి చెందిన ఓ లీడర్ అరగంట వ్యవధిలోనే రెండు పార్టీలు మారాడు. బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వన్నాడ వెంకటేశ్‌గౌడ్ మంగళవారం ఉదయం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కారు దిగి కాంగ్రెస్ అ భ్యర్థి శంకర్ సమక్షంలో పార్టీలో చేరారు. మరో అరగంట వ్యవధిలోనే తిరిగి ఆయన కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ సమక్షంలో సొంతగూటికి చేరారు. ప్రస్తుతం ఈ విషయంలో పట్టణంలో చర్చనీయాంశమైంది.

– షాద్‌నగర్



అరగంటలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన వెంకటేశ్ గౌడ్